
సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 10 । జనవరి । 2023



ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్

ఓబులవారిపల్లి మండలం బాలిరెడ్డిపల్లి గ్రామం గవిగట్టు ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న మంగళి ప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. - 8లో



ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీసులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్దన్ రాజు సూచించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.134	రూ.180
రెండోరకం	రూ.80	రూ.230



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 178 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	692	714
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 331.54 కిలోలు

న్యూస్‌రీల్

నేడు తలనీలాల వేలం పాట

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న శ్రీ నిత్యపూజ స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి భక్తులు సమర్పించుకునే తలనీలాల పోగు హక్కు కోసం మంగళవారం ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కొండారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహా శివరాత్రి ఉత్సవాలు ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు మూడు జరుగుతాయన్నారు. వేలం పాటలో పాల్గొనే ప్రతి పాటా దారుడు ధరావత్తు కింద రూ. 1,00,000 చెల్లించాలన్నారు.

'నవోదయ'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



రాయచోటిటౌన్ : అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని నవోదయ విద్యాలయంలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లె, వాయల్పాడు, పీలేరు, తంబళ్లపల్లె పరిధిలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని వివరించారు. జనవరి ఆఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. విద్యార్థులు 01.05.2011 నుంచి 30.04.2013 మధ్యలో పుట్టిన వారు మాత్రమే అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం 9491832148, 8297726559, 9494890447 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి



ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మి

రాయచోటి అర్బన్ : జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీఅంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ఎం.ధనలక్ష్మి కోరారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని పలు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 48 అంగన్‌వాడీ, 109 సహాయకురాళ్లు, 11 మినీ అంగన్‌వాడీ కార్యకర్త ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ వర్కర్‌లు,సహాయకురాళ్లు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హులు ఈనెల 13వతేదిలోగా దరఖాస్తు చేసుకోవాని కోరారు.దరఖాస్తుదారులు స్థానికంగా నివాసం ఉండడం తోపాటు 21 ఏళ్ల పైబడి 35 సంవత్సరాల లోపు వయస్సుగల వివాహిత అయి ఉండాల న్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అర్హతలు,వెయిటేజిని అనుసరించి మౌఖిక పరీక్ష ద్వారా ఎంపిక ప్రక్రియ జరుగు తుందన్నారు. స్థానికత నిరూపణ కోసం ఆధార్, రేషన్,ఓటర్‌కార్డు, తహసీల్దార్ జారీచేసిన నివాస ధ్రువీకరణ పత్రం ఉండాలన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లు దరఖాస్తుకు జతపరచాలని కోరారు. ఎస్సీ,ఎస్టీల కోసం రిజర్వు చేసిన కేంద్రాలకు ఆయా వర్గాల వారే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈడబ్ల్యూఎస్,ఓహెచ్ కేటగిరీల అంగన్‌వాడీ కేంద్రాలకు ఆయా కేటగిరీలకు చెందిన మహిళలే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఫిబ్రవరి 1న విద్యార్థులకు శ్లోకాల పోటీ

కడప కల్చరల్ : తిరుమల–తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న విద్యార్థులకు భక్తి శ్లోకాల పోటీ నిర్వహించనున్నామని టీటీడీ అనుబంధ సంస్థ హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ టి.గోపిబాబు తెలిపారు. పదేళ్లలోపు విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చని, అచ్యుతాష్టకం, విష్ణుసహస్ర నామ శ్లోకాలపై ఈ పోటీ ఉంటుందన్నారు. కడప నగరం టీటీడీ కల్యాణ మండపంలోగల హిందూ ధర్మ ప్రచార పరిషత్ కడప శాఖ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు అచ్యుతాష్టకంపై పోటీలు నిర్వహిస్తామన్నారు. 15 ఏళ్లలోపు విద్యార్థులకు విష్ణుసహస్ర నామ శ్లోకాలపై పోటీ ఉంటుందన్నారు. వివరాలకు 91107 79066 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్ తొలగింపు

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లా ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్‌ను ఆ సంఘం నుంచి తొలగించినట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవులు, వైఎస్సార్ జిల్లా ఇన్‌చార్జి చెంగల్రాయమండడి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం వల్ల గత ఏడాది అక్టోబర్ 30వ తేదీన రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆయనను తొలగించిందన్నారు. ఆయన స్థానంలో రాళ్లపల్లి అబ్బుల్లాను నియమించినట్లు వారు తెలిపారు.



మదనపల్లె ఆర్టీసీ బస్టాండు

ఆర్టీసీకి పండుగ

- జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆయా నగరాలకు ప్రత్యేక సర్వీసులు
- సాధారణ చార్జీలతోనే స్పెషల్ సర్వీసులు నడపడంపై హర్షం

జిల్లా ప్రజా రవాణాకు సంబంధించిన సమాచారం

జిల్లాలో బస్సు డిపోలు	05
బస్సుల సంఖ్య	484
ప్రతిరోజు ఆర్టీసీకి వస్తున్న ఆదాయం	రూ.65 లక్షలు
జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారు	1.50 లక్షలు

సాక్షి రాయచోటి : ఏడాది ఆరంభంల్లో తొలుత వచ్చే పెద్ద పండుగ సంక్రాంతి రానే వచ్చింది. నాలుగు రోజులు ముందుగానే అన్నిచోట్ల కొత్త సందడి కనిపిస్తోంది. ఒకవైపు రంగవల్లులు..మరోవైపు బసవన్నలు కనిపిస్తుండగా..ఇంకోవైపు నగరాల నుంచి సొంతూర్లకు వచ్చేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. దీనికి తోడు పాఠశాలలకు సెలవుల ప్రకటన వెలువడడంతో కుటుంబాలతోసహా స్వస్థలాలకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సంక్రాంతి పండుగను బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు అందరూ కలుసుకుని సొంతూర్లలో ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. వివిధ నగరాల నుంచి వచ్చే వారికి..పండుగ అనంతరం మళ్లీ ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రజా రవాణా సంస్థ ఏర్పాట్లు చేస్తోంది.

ప్రత్యేక సర్వీసులు

అన్నమయ్య జిల్లాకు సంబంధించి మదనపల్లె, పీలేరు, రాయచోటి, తంబళ్లపల్లె, రైల్వేకోడూరు, రాజంపేట తదితర ప్రాంతాలకు చెందిన వారు వ్యాపారాలు, ఉద్యోగాలు, ఇతర పారిశ్రామిక రంగాల్లో స్థిరపడి వివిధ నగరాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ప్రధానంగా బెంగళూరు, విజయవాడ, చెన్నై, హైదరాబదు, తిరుపతి ప్రాంతాల్లో ఉంటున్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో సొంతూర్లకు వచ్చేందుకు పయనమవుతున్న తరుణంలో ప్రజా రవాణా సంస్థ అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తోంది. అక్కడి నుంచి ఇక్కడికి వచ్చేవారి కోసం సుమారు 40 ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. అంతేకాకుండా పండుగ ముగిసిన తర్వాత తిరిగి వెళ్లేందుకు వీలుగా సుమారు 70 బస్సులను వినియోగిస్తున్నారు. అందుకు సంబంధించి ప్రజా రవాణాశాఖ ప్రణాళికలు రూపొందించింది.

సాధారణఛార్జీలతోనే 'ప్రత్యేక'ప్రయాణం

రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ సంస్థ విలీనమైన తర్వాత పండుగల నేపథ్యంలో ప్రభుత్వం అదనపు చార్జీలు వసూలు చేయకుండా ప్రయాణికులకు తనవంతుగా సేవలు అందిస్తోంది. సాధారణ ఛార్జీలకే ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించేలా వీలు కల్పించింది. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ తిరిగేవి కాకుండా స్పెషల్ బస్సులు కూడా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వినియోగిస్తున్నారు. ఇదిలా ఉండగా సంక్రాంతి పండగను పురస్కరించుకుని రెండు నెలల ముందునుంచే అటు రైళ్లల్లోనూ, ఇటు అనుకూలతలను బట్టి విమానాలు, ప్రైవేటు ట్రావెల్స్‌లోనూ టిక్కెట్లు బుక్ అయ్యాయి. కొందరు బాడుగ వాహనాలు తీసుకుని ప్రత్యేకంగా వస్తుండగా, మరికొందరు సొంత వాహనాల్లో ఊరికి పయనమవుతున్నారు.

11 నుంచి ప్రత్యేక సర్వీసులు

అన్నమయ్య జిల్లాకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు స్వస్థలాలకు వచ్చేందుకు వీలుగా ఈనెల11వ తేదీ నుంచి సర్వీసులు నడుపుతున్నాం. అక్కడి నుంచి రావడానికి, పండుగ తర్వాత ఇక్కడి నుంచి వెళ్లడానికి సుమారు 110 సర్వీసులు నడుపుతున్నాం. సాధారణ బస్సుల తోపాటు ప్రత్యేక సర్వీసులను అందుబాటులోకి తెస్తున్నాం. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజా రవాణా సంస్థ ప్రణాళికలు రూపొందించింది.

– జగదీష్, జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి, అన్నమయ్య జిల్లా

స్పందన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



ప్రజల నుంచి విజ్ఞాపనలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్‌ఓ తదితరులు

రాయచోటి : స్పందన కార్యక్రమంలో అందజేస్తున్న అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ సత్యనారాయణ, డ్వామా పీడీ మద్దిలేటి ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా గడువు లోగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

స్పందన కార్యక్రమంలో కొన్ని సమస్యలు:

- నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎస్.బాషామొహిద్దీన్ వృద్ధాప్య పింఛన్ తొలగించారని జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.
- సంబేపల్లె మండలం నాగిరెడ్డిగారిపల్లెకు చెందిన ఎం.నారాయణరెడ్డి సర్వే నెంబర్ 901లో 11 ఎకరాల తన భూమిని ఇతరులు ఆక్రమించుకునానరని విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని విన్నవించారు.
- గుర్రంకొండ మండలం తరిగొండ గ్రామానికి చెందిన వి.నరేంద్రకుమార్ సర్వే నెంబర్ 1099/1లో 5.46 ఎకరాల భూమిని ఇతరులు ఆన్‌లైన్ చేయించుకున్నారని విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.
- రాయచోటి మండలం మాధవరం గ్రామానికి చెందిన బి.పెద్దప్ప తన ఇంటికి మంచినీటి కుళాయి కనెక్షన్ ఇప్పించాలని అర్జీ ఇచ్చారు.

ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్లు 46,318, టీచర్లు 3,565 మంది ఓటర్లు

రాయచోటి : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గ్రాడ్యుయేట్లు, టీచర్ల ఓటర్ల జాబితాలలో అభ్యంతరాలు ఉంటే సవరించుకోవచ్చని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ విసి హాల్‌లో రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 46,318 మంది గ్రాడ్యుయేట్లు ఉన్నారన్నారు. ఇందులో పురుషులు 30,963 మంది, స్త్రీలు 15,349 మంది, ఇతరులు 6గురు గ్రాడ్యుయేట్ల ఓటర్లు ఉన్నారన్నారు. జిల్లాలో మొత్తం 43 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లు రాజంపేట నియోజకవర్గంలో పురుషులు 5659, స్త్రీలు 2809, ఇతరులు ఒకరు, మొత్తం 8469 మంది ఓటర్లు ఉన్నారన్నారు. కోడూరు నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు పురుషులు 5549, స్త్రీలు 2389, ఇతరులు 4 మొత్తం 7942 మంది ఓటర్లు ఉన్నారన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు పురుషులు 4254, స్త్రీలు 1994 మొత్తం 6248 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పీలేరు నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు పురుషులు 6290, స్త్రీలు 2898 మొత్తం 9188 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు పురుషులు 4993, స్త్రీలు 3346, ఇతరులు ఒకరు మొత్తం 8340 మంది ఓటర్లు ఉన్నారన్నారు. టీచర్ల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి జిల్లా మొత్తం 3,565 మంది ఓటర్లుగా ఉన్నారని.. పురుషులు 2338 మంది, మహిళలు 1227 మంది ఓటర్లుగా ఉన్నారన్నారు. రాజంపేట నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఓటర్లు పురుషులు 455, స్త్రీలు 237 మొత్తం 692 మంది ఓటర్లు ఉన్నారన్నారు. కోడూరు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఓటర్లు పురుషులు 342, స్త్రీలు 229 మొత్తం 810 మంది ఓటర్లు ఉన్నారన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఓటర్లు పురుషులు 128 , స్త్రీలు 45 మంది ఉన్నారన్నారు. పీలేరు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఓటర్లు పురుషులు 395 మంది, స్త్రీలు 144 మొత్తం 539 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఓటర్లు పురుషులు 437 మంది, స్త్రీలు 385 మంది మొత్తం 822 మంది ఓటర్లు ఉన్నారన్నారు.

బోధన ప్రమాణాలు, పరిశోధనలపై ప్రత్యేక గురి

- నూతన వైస్ చాన్సలర్ ఆచార్య జింకా రంగజనార్దన
- వైవీయూ వీసీగా బాధ్యతల స్వీకరణ
- ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌లో 100లోపు తెచ్చేందుకు కృషి
- దూరవిద్య అందుబాటులోకి
- శుభాకాంక్షలు తెలిపిన బోధన, బోధనేతర సిబ్బంది



వ్యాయామవిద్య, క్రీడాశాస్త్రంలో రైఫిల్‌షూటింగ్ చేస్తున్న వీసీ ఆచార్య రంగ జనార్దన

వైవీయూ : విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన బోధన, పరిశోధనలు అందించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ (ఎఫ్‌ఏసీ) ఆచార్య జింకా రంగజనార్దన పేర్కొన్నారు. వైవీయూ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా నియమితులైన ఆయన సోమవారం ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో అధ్యాపకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పోటీని తట్టుకుని నిలబడేలా విశ్వవిద్యాలయాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. వైవీయూకు రెండో సైకిల్‌లోనే న్యాక్ ఏ గ్రేడ్ లభించడం ఇక్కడి అధ్యాపకులు, సిబ్బంది టీం పనితీరుకు నిదర్శనమన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్) ర్యాంకు 101 నుంచి 150 మధ్యలో ఉన్నామని, రానున్న రోజుల్లో ఈ ర్యాంకును 100లోపు తీసుకువచ్చేందుకు కృషిచేస్తామని తెలిపారు. అదే విధంగా వైవీయూలో దూరవిద్యను ప్రారంభించడంతో పాటు డిమాండ్ ఉన్న కోర్సులను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. విశ్వవిద్యాలయంలో పరిశోధనలకు పెద్దపీట వేసేలా మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీ ఉన్నతవిద్యామండలి అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని డీన్‌లు, ఆచార్యులు, విభాగాధిపతులు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం పలు విభాగాలను ఆయన పరిశీలించారు.

శుభాకాంక్షల వెల్లువ..

నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జింకా రంగ జనార్దనను రిజిస్ట్రార్ ఆచార్య వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రొద్దుటూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజు, పాలక మండలి సభ్యులు ఆచార్య పుత్తా పద్మ, డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్, డీన్‌లు ఆచార్య రామప్రసాద్‌రెడ్డి, ఆచార్య రమణయ్య, ఆచార్య విజయరాఘవప్రసాద్, ఆచార్య పి.ఎస్. షావలీఖాన్ కలిసి వీసీకి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాసంకల్పయాత్ర చరిత్రాత్మకం

ఎమ్మెల్యేమేడా, జెడ్పీచైర్మన్ ఆకేపాటి



కేకను కట్‌చేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

నందలూరు(రాజంపేట) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలదగ్గరకు వెళ్లేందుకు చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర చరిత్రాత్మకమని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జిల్లాపరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. మండలంలోని నల్లతిమ్మాయపల్లెలో ప్రజాసంకల్పయాత్ర నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా నూతన సచివాలయభవనాన్ని ప్రారంభించి, కేక్ కట్‌చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ సుదీర్ఘంగా ప్రజాసంకల్పయాత్ర చేపట్టి ప్రజలు సమస్యలను స్వయంగా తెలుసుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుపరచడంలో సీఎం సఫలీకృతులయ్యారన్నారు. ప్రజల కన్నీళ్లు, కష్టాలను దగ్గరగా చూసారు కాబట్టి నవరత్నాల ద్వారా మేలు చేసే కార్యక్రమాలను చేపట్టారన్నారు. దేశంలో ఓ మోడల్ సీఎంగా అన్ని రాష్ట్రాల ప్రజల ప్రశంసలు పొందుతున్నారని అన్నారు. ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, సర్పంచి గీతాల శిరీషానరసింహారెడ్డి, ఎంపీటీసీ పణతల రాజేశ్వరి, ముదిరాజ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టరు లక్ష్మీనరసయ్య, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ నాగసుబ్బయ్య, సింగల్‌విండో అధ్యక్షుడు పాలగిరిసుధాకర్‌రెడ్డి, నాయకులు నరసారెడ్డి, పణతల రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రాజకీయాల్లో మరచిపోలేని ఘట్టం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి కేక్‌ను తినిపిస్తున్న కౌన్సిలర్ సుగవాసి శ్యామ్

రాయచోటి : జగన్ ప్రజాసంకల్ప యాత్ర రాష్ట్ర రాజకీయాల్లో మరచిపోలేని ఘట్టమని అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. జగన్ ప్రజా సంకల్ప పాదయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, కౌన్సిలర్లు, కార్యకర్తలతో కలసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా కేక్‌ను కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాద యాత్ర ఫలాలు మూడున్నరేళ్లగా ప్రజలకు అందుతున్నాయన్నారు. నాడు పాదయాత్రలో ప్రజల కష్టాలను కళ్లారా చూశారని, వాటినే ఎన్నికల ప్రణాళికల్లో పొందుపరిచారని ఎమ్మెల్యే అన్నారు. వైఎస్ జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చి సుపరిపాలన అందిస్తున్నారన్నారు.


అయ్యారే అరిసెలు..భళారే లడ్డూలు

- సంక్రాంతికి సిద్ధమవుతున్న సంప్రదాయ స్వీట్లు
- పిండి వంటల తయారీలో బిజీగా మహిళలు



పిండి వంటలను తయారు చేస్తున్న మహిళలు





రాజంపేట టౌన్ : సంక్రాంతి వచ్చేస్తుంది. ఎక్కడెక్కడో స్థిరపడిన బంధువుల రాక మొదలు కానుంది. వారు వచ్చేసరికి సంక్రాంతి స్వీట్లు సిద్ధం చేయాలని మహిళలు పిండి వంటల తయారీలో బిజీగా ఉన్నారు. ఇప్పుడు సంక్రాంతి షాపుల్లో సంక్రాంతి స్వీట్లు రెడిమేడ్‌గా దొరుకుతున్నప్పటికీ చాలామంది సొంతం సొంతపాకం పడుతున్నారు. కరోనా కారణంగా గత రెండు సంవత్సరాల నుంచి కలిసి, మెలసి స్వీట్లు చేసుకోలేని మహిళలు ఈ ఏడాది కరోనా లేక పోవడంతో ఇరుగు పొరుగు వారు ఒకచోట చేరి పిండివంటలు తయారు చేస్తున్నారు.

సంక్రాంతి స్వీట్లకు తగ్గని క్రేజ్

సంక్రాంతి స్వీట్లకు నేటికీ క్రేజ్ తగ్గలేదు. గతంలో మార్కెట్‌లో కొన్ని రకాల స్వీట్లు మాత్రమే దొరికేవి. అయితే ఇప్పుడు అనేక రకాలు అందుబాటులోకి వచ్చాయి. చివరికి మధుమేహ వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేకమైన స్వీట్లు దొరుకుతున్నాయి.అయినప్పటికీ సంక్రాంతి రానుండటంతో ప్రజలు మాత్రం సంప్రదాయ స్వీట్లను స్వయంగా చేసుకొని తినేందుకు ఇష్టపడుతున్నారు.

స్పెషల్ స్వీట్లు ఇవే...


సంక్రాంతి స్వీట్లలో అనాదిగా అత్తిరాసలు(అరిసెలు), లడ్డూలు, కజ్జికాయలు, బియ్యం కారాలు ప్రసిద్ధిగాంచాయి. కొంత మంది మురుకులు, శనగపిండి కారాలు, పప్పుబిళ్లలు చేసుకుంటారు. సంక్రాంతి పండుగకు విదేశాల నుంచి వచ్చేవారు తిరిగి వెళ్లేటప్పుడు ఈ స్వీట్లు, కారాలను తీసుకెళతారు.

గంగిరెడ్డిపాళెం మహిళల ఆలోచన అదుర్స్

సాధారణంగా స్వీట్లు తయారు చేసే విషయంలో ఇరుగుపొరుగు మహిళలు ఒకొక్క రోజు ఒకరి ఇంటికి వెళ్లి వారికి సంబంధించిన స్వీట్లు, కారాలు చేస్తారు. లేకపోతే విశాలమైన స్థలంలో అందరూ కలిసి వారి, వారి పిండి పదార్థాలతో స్వీట్లు తయారు చేయిస్తారు. అయితే పట్టణంలోని గంగిరెడ్డిపాళెంకు చెందిన మహిళలు ఇందు భిన్నం. అదెలా అంటే... స్వీట్లు, కారాలకు కావాల్సిన వస్తువులన్నీ కొనుగోలు చేస్తారు. ఆ వస్తువులకు అయిన డబ్బులను ఒక్కొక్కరికి ఎంతపడుతుందో అంత చెల్లిస్తారు. ఇక స్వీట్లు తయారు చేశాక మొత్తం లెక్కపెట్టి వాటిని లెక్క ప్రకారం షేర్ చేసుకుంటున్నారు. కారాల విషయంలోనూ ఇదే విధానాన్ని పాటిస్తున్నారు. ఆ ప్రాంతంలోని ఆరు కుటుంబాలకు చెందిన మహిళలు ఈ విధంగా స్వీట్లు చేసుకోవడం విశేషం.

సీజన్‌కు తగ్గట్టుగా..

కొంత మంది వ్యాపారులు ఆయా సీజన్‌కు తగ్గ వ్యాపారం చేస్తుంటారు. అయితే పట్టణంలోని ఓ మంచాల అల్లిక వ్యాపారి సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని వైరు మంచంపై 'హ్యాపీ సంక్రాంతి' అన్న అక్షరాలను పొందుపరిచాడు. ఈ విధంగా మంచం అల్లికను రూపొందించడానికి కారణం కూడా ఉందని ఆ వ్యాపారి చెప్పుకొచ్చారు. గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో వేల సంఖ్యలో వివాహాలు జరిగినందున సంక్రాంతికి కొత్త అల్లుళ్లు వస్తారని, అందువల్ల సంక్రాంతి కానుకగా అల్లుల్లకు ఇలాంటి మంచం బహుమతిగా ఇస్తే వారికి ఓ తీపి గుర్తుగా ఉంటుందన్న ఆలోచనలతో మంచాన్ని ఇలా అల్లి విక్రయానికి పెట్టినట్లు చెప్పుకొచ్చారు. కేవలం పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని మంచం తయారు చేసినట్లు వ్యాపారి తెలిపారు



మంచంపై హ్యాపీ సంక్రాంతి

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్

7 దుంగల స్వాధీనం


నిందితుడు, దుంగలతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : ఓబులవారిపల్లి మండలం బాలిరెడ్డిపల్లి గ్రామం గవి గట్టు ప్రాంతంలో కారులో 7 ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న మంగళి ప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. కారు, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ బాలకృష్ణ సోమవారం నిందితుడిని మీడియా ఎదుట హాజరు పరిచి, వివరాలు వెల్లడించారు. మంగళి ప్రసాద్ స్థానిక కొత్త కోడూరులో నివాసముంటూ ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నాడని తెలిపారు. గతంలో అతనిపై 6 కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. దాడుల్లో అధికారి కృపానంద తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

పీలేరు : వాహనంతో సహా రూ.14 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్‌వో వెంకటరమణ తెలిపారు. వివరాలిలా వున్నాయి. పీలేరు – చిత్తూరు రోడ్డు మార్గం మధ్యలో ఎర్రచందనం తరలిస్తున్నారన్న సమాచారంతో అటవీ సిబ్బంది అశోక్‌నగర్ వద్ద నిఘా ఉంచారు. ఆదివారం రాత్రి నుంచి వాహనాలు తనిఖీ చేస్తుండగా.. సోమవారం తెల్లవారుజామున వచ్చిన ఓ వాహనాన్ని సిబ్బంది ఆపేందుకు ప్రయత్నించారు. అయితే డ్రైవర్ ఆపకుండా ముందుకు పోవడంతో ఫారెస్ట్ సిబ్బంది వెంబడించారు. డ్రైవర్ వాహనాన్ని రోడ్డుపక్కన ఆపి పరారయ్యాడు. వాహనాన్ని చుట్టిముట్టిన సిబ్బంది పరిశీలించగా.. ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. వాహనం, 344 కేజీల బరువు గల 11 ఎర్రచందనం దుంగల విలువ సుమారు రూ.14 లక్షలు ఉంటుందని ఎఫ్ఆర్‌వో తెలిపారు. ఈ దాడిలో ఎఫ్‌బీవో కుప్పుస్వామి, సిబ్బంది దేవేంద్ర, చరణ్ పాల్గొన్నారు.

గండికోటలో సినీ స్టూడియో నిర్మించాలి

- ఘనంగా ఆవిర్భావ దినోత్సవం
- రాజవంశీయుడు ప్రభాకర్‌నాయుడు


గండికోట ఫొటోలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కడప కల్చరల్ : గండికోటలో సినిమా స్టూడియో నిర్మించాలని, అటు సినీ పరిశ్రమ విస్తరించడమే కాకుండా ఉపాధి అవకాశాలు పెరిగి జిల్లా మరింత అభివృద్ధి చెందగలదని గండికోట రాజవంశీయులు పెమ్మసాని ప్రభాకర్‌నాయుడు తెలిపారు. సోమవారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో గండికోట 900వ ఆవిర్భావ దినోత్సవం జనవరి 9న పురస్కరించుకుని కడప నగరం హోటల్ గ్రాండ్ ఇన్‌లో ఆయన ఇతర అతిథులతో కలిసి గండికోట ఫొటోల ప్రదర్శన ప్రారంభించి కొత్త ఫొటోలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గండికోటకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఒబెరాయ్ హోటల్స్ రావడం, స్టార్‌హోటళ్లు, విల్లాలు నిర్మాణమయ్యే అవకాశాలు పెరిగాయన్నారు. ఇప్పటికే కోటలో సినిమా షూటింగ్‌లు జరుగుతున్నాయని, స్టూడియో నిర్మిస్తే ఆ ప్రాంతం దశ మారుతుందన్నారు. సంస్థ చీఫ్ ప్యాట్రన్ లయన్ మానస చిన్నపరెడ్డి మాట్లాడుతూ వెడ్డింగ్ షూట్‌లతోపాటు గండికోటలో తరచూ వివాహాలు, షార్ట్‌ఫిల్మ్‌లు నిర్మిస్తున్నారని, ఫ్రీ కోట్ టెంట్ల ద్వారా పెద్ద ఎత్తున పర్యాటకులకు వసతులు కల్పిస్తూ స్థానికులు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. అక్కడ పెద్ద ఎత్తున బడ్జెట్ హోటళ్లు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పక్షాన గండికోటలో సినీ స్టూడియో నిర్మిస్తే ఈ ప్రాంతంలోని ఇతర పర్యాటక ప్రాంతాలు కూడా గొప్పగా అభివృద్ధి చెంది జిల్లా ఆర్థికంగా బలపడగలదన్నారు. గ్రాండ్ ఇన్ హోటల్ అధినేత చిన్నప్పరెడ్డి మాట్లాడుతూ గండికోటలో రోప్‌వే నిర్మాణం జరుగుతున్నదని, దీంతోపాటు గ్లాస్ బ్రిడ్జి నిర్మాణం జరిగితే అంతర్జాతీయంగా పర్యాటకులు వెల్లువెత్తే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పండ ట్రావెల్స్ అధినేత సయ్యద్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, గౌరీశంకర్, పలువురు టూరిజం అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

- భూ వివాదంలో కమీషన్ ఇవ్వలేదని సొమ్ము తస్కరణ
- డీఎస్పీ కేశప్ప వెల్లడి


నిందితుల అరెస్ట్, స్వాధీనం చేసుకున్న నగదు చూపుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : భూ వివాదంలో ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చినందుకు కమీషన్ ఇవ్వలేదని కోర్టు ఆవరణలో కక్షిదారులకు చెందిన రూ.4 లక్షలను దొంగిలించిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేశప్ప వివరాలు వెల్లడించారు. మదనపల్లె మండలం కొండామర్రిపల్లె ఇసుకనూతపల్లెకు చెందిన కమ్మిశ్ల విజయ్‌కుమార్(48), వలసపల్లె పంచాయతీ మొలకలదిన్నెకు చెందిన పూలగంటి మధుసూధన్, ఉప్పుతోళ్ల హరిబాబు కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా స్థలాలు కొనడం, అమ్మడం చేసేవారు. ఈక్రమంలో నడిగడ్డ బి.లక్ష్మీపతినాయుడుకు చెందిన మొలకలదిన్నె పంచాయతీ సర్వే నంబర్ 7/2లోని భూమి కొనుగోలు చేశారు. కలికిరి మండలానికి చెందిన రామచంద్రారెడ్డి తనకు అదే సర్వే నంబర్ భూమిలో భాగం ఉందని మదనపల్లె అడిషనల్ సివిల్ జడ్జి కోర్టులో ఓఎస్ నంబర్ 278/2022 కింద కేసు వేశారు. కేసు కోర్టులో ఉండగా, రాజీ అయ్యేందుకు రామచంద్రారెడ్డికి లక్ష్మీపతినాయుడు, మధుసూధన్ కలిసి రూ.4 లక్షలు ఇవ్వాలని పెద్దమనుషులైన గోవర్ధన్‌నాయుడు, రామకృష్ణ తీర్మానించారు. దాని ప్రకారం గత ఏడాది డిసెంబర్ 29న లక్ష్మీపతినాయుడు, మధుసూధన్ రూ.4 లక్షలను రామచంద్రారెడ్డికి ఇచ్చారు. తర్వాత అడ్వకేట్ ద్వారా కోర్టులో ఇరు వర్గాలు రాజీ చేసుకున్నట్లు తెలిపారు. రామచంద్రారెడ్డి, అతని తమ్ముడు రమణారెడ్డి రాజీ ద్వారా వచ్చిన రూ.4 లక్షలను తీసుకుని.. కారులో కోర్టు కాంపౌండ్ నుంచి బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో మధుసూధన్, హరిబాబు అడ్డుకున్నారు. పెద్దమనుషులు తీర్మానించినట్లుగా భూ వ్యవహారంలో తమకు రావాల్సిన కమీషన్ ఇచ్చి వెళ్లాల్సిందిగా కోరారు. దీనికి రామచంద్రారెడ్డి, అతని తమ్ముడు రమణారెడ్డి నిరాకరించారు. దీంతో వారితో గొడవపడిన మధుసూధన్, హరిబాబు కారులో ఉన్న రూ.4 లక్షలను బలవంతంగా లాక్కుని అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో రామచంద్రారెడ్డి కోర్టు ఆవరణలో కేసులో రాజీకి సంబంధించి వచ్చిన నగదును దొంగిలించుకుని వెళ్లారని మధుసూధన్, విజయ్‌కుమార్, హరిబాబుపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు ముగ్గురిని సోమవారం ఉదయం ఇసుకనూతిపల్లె వద్ద అరెస్ట్ చేసి దొంగిలించుకు వెళ్లిన నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నంబర్ 219/2022 కింద ముగ్గురు నిందితులపై ఐపీసీ 380 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి సీఐ సాదిక్‌అలీ, రూరల్ సీఐ శివాంజనేయులు, ఎస్ఐ హరిహరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంపై కేసు నమోదు

కలికిరి : ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ మనోహర్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమల మండలం కందూరుకు చెందిన వెంకటరమణ, సుబ్రమణ్యం కలిసి శనివారం ద్విచక్రవాహనంలో కలికిరి మండలం గుండ్లూరుకు వెళుతున్నారు. మార్గంమధ్యలో కొత్తగజ్జలవారిపల్లి వద్ద మేడికుర్తికి చెందిన షబ్బీర్ తన ద్విచక్ర వాహనంతో వెనుక వైపు నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వెంకటరమణ, సుబ్రమణ్యంకు కుడికాళ్లు విరిగాయి. బాధితులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వెంకటరమణ కుమార్తె ఆశ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

చిన్నమండెం : ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మల్లూరు గ్రామం మాండవ్యానదిలోని ఇసుకను అనుమతి లేకుండా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

యువతి అదృశ్యం

ఓబులవారిపల్లె : మంగంపేట దళితవాడ గ్రామానికి చెందిన జి.మధు అనే యువతి కొన్ని రోజులుగా కనిపించకపోవడంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గత నెల 17వ తేది మధ్యాహ్నం స్వగృహం నుంచి వెళ్లిపోవడంతో బంధువులు, స్నేహితులను విచారణ చేసినా ఫలితం లేకపోయింది. దీంతో యువతి తండ్రి జి.రాజ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం ఆటో అదుపు తప్పి బారీకేడ్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కలకత్తాకు చెందిన బిస్వాజీ అనే వ్యక్తి దుస్తుల వ్యాపారం చేసుకునేవాడు. ఈ క్రమంలోనే పులివెందుల నుంచి ఆటోలో దుస్తులు తీసుకొని అన్నమయ్య జిల్లా కల్లూరుకు వెళ్తుండగా.. సంబేపల్లె మండలంలోని మోటకట్ల సమీపంలోకి రాగానే అదుపు తప్పి బారీకేడ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ లక్ష్మీనారాయణ, బిస్వాజీలకు తీవ్ర గాయాలయ్యాయి.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీసులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుని విషయాలను అడిగి తెలుసుకొని సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి తెలిపారు. స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని ఆదేశించారు. స్పందనలో మహిళలకు, వృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కుటుంబ కలహాలు, ఆర్థికపరమైన నేరాలు, ఆస్తి తగాదాలు ఇతరత్రా కారణాలతో అధిక ఫిర్యాదులు వచ్చాయన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 52 మంది వారి సమస్యలను స్పందన ద్వారా ఎస్పీకి విన్నవించారు.

నాన్నా.. నేనూ నీ వెంటే..

తండ్రి లేడని తనువు చాలించిన తనయుడు


జశ్వంత్‌ఆచారి (ఫైల్)

మదనపల్లె : 'తండ్రి లేని ఈ లోకం తన కొద్దు' అని ఓ కుమారుడు భావించాడు. ప్రపంచాన్ని పరిచయం చేసి, ప్రయోజకుడిగా ఎదిగేందుకు కారకుడైన తండ్రి మరణాన్ని తట్టుకోలేక ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తనువు చాలించిన సంఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని ఎస్‌వీఆర్ లేఅవుట్‌కు చెందిన సుబ్రహ్మణ్యం ఆచారి అనారోగ్య కారణాలతో పది రోజుల క్రితం మృతి చెందాడు. సుబ్రహ్మణ్యం ఆచారి, సరస్వతి దంపతులకు జశ్వంత్ ఆచారి ఏకైక కుమారుడు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. తండ్రి మరణంతో కర్మకాండల నిమిత్తం బెంగళూరు నుంచి మదనపల్లెకు వచ్చాడు. దశదిన కర్మ నిమిత్తం ఇంటి వద్దే ఉన్నాడు. 11 రోజుల వైకుంఠ సమారాధన కార్యక్రమం తర్వాత తల్లి సరస్వతి కుమారుడు జశ్వంత్ ఆచారిని ఇంటిలో వదిలి, సంప్రదాయం ప్రకారం పుట్టినింటికి వెళ్లింది. చిన్నప్పటి నుంచి తండ్రితో గాఢమైన అనుబంధాన్ని ఏర్పరచుకున్న జశ్వంత్ ఆచారి(26) ఆయన మరణాన్ని జీర్ణించుకోలేక ఆదివారం రాత్రి ఇంటిలో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం ఎంతసేపటికీ అతను బయటకు రాకపోవడంతో గమనించిన స్థానికులు ఇంటిలోకి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో గమనించారు. వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించగా వారు వెళ్లి పరిశీలించారు. అయితే అప్పటికే మృతి చెంది ఉండటంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. జశ్వంత్‌ఆచారికి చిన్నప్పటి నుంచీ నాన్న అంటే వల్లమాలిన ప్రేమ. తండ్రి సుబ్రహ్మణ్యం ఆచారి కుమారుడు జశ్వంత్ ఆచారిని అల్లారుముద్దుగా పెంచుతూ కంటికి రెప్పలా చూసుకున్నాడు. శక్తికి మించి ఖర్చు చేసి బాగా చదివించి ప్రయోజకుడిని చేశాడు. ఈ క్రమంలో తండ్రి మరణం మానసికంగా కుంగదీసింది. తండ్రి ఇకలేడని, తాను ఒంటరివాడై పోయానని భావించి తీవ్ర ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మద్యం సేవించిన ప్రభుత్వ ఉద్యోగిపై కేసు

మదనపల్లె : మండలంలోని సీటీఎం పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ విధుల్లో మద్యం సేవించి ఉండటంపై సోమవారం తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా వెంకటేష్‌పై బహిరంగ మద్య సేవనం కేసు నమోదు చేసి పరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఈ విషయమై ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వెంకటేష్ మద్యం సేవించి విధులకు హాజరవుతున్నాడని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీటీఎం పీహెచ్‌సీకి వెళ్లి విచారణ చేశామన్నారు. విచారణలో వెంకటేష్ మద్యం తాగడమే కాకుండా ఆస్పత్రికి వచ్చే రోగులతో ఘర్షణలకు దిగడం, పబ్లిక్ న్యూసెన్స్ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. దీంతో అతడిపై కేసు నమోదు చేశామన్నారు.

అయ్యో.. పాపం

మూతికి డబ్బా ఇరుక్కుని యాతన


మూతికి డబ్బా ఇరుక్కోవడంతో ఇబ్బంది పడుతున్న శునకం

కురబలకోట : కురబలకోట దగ్గరున్న డీఆర్ నగర్‌లో ఓ శునకానికి పెద్ద కష్టం వచ్చి పడింది. అది తొలగక పోవడంతో పది రోజులుగా పడరాని పాట్లుపడుతోంది. తిండి కోసం ప్లాస్టిక్ డబ్బాలో మూతి పెడితే అది కాస్తా గట్టిగా మూతికి ఇరుక్కుపోయింది. అది ఊడిపోకపోవడంతో సతమతం అవుతోంది. దీంతో తిండి తిన లేని, నీళ్లు తాగలేని దయనీయ స్థితి. గాలితోనే కాలం వెల్లదీస్తోంది. కుక్క చేతికి చిక్కితే కత్తెరతో ప్లాస్టిక్ డబ్బాను కత్తిరించి సులభంగా బయటపడేయవచ్చు. ముందే మూతికి ప్లాస్టిక్ డబ్బా ఉంది.. మనిషి దగ్గరకు వెళితే ఏం చేస్తారో ఏమోనన్న మరింత భయంతో దూరంగా పరుగులు తీస్తోంది. ఇది ప్లాస్టిక్ డబ్బా కావడంతో దగ్గరకు వచ్చే వారు కన్పిస్తుండడంతో దొరక్కుండా పారిపోతోంది. డబ్బా తీసేయాలని స్థానికులు ఎంతగా ప్రయత్నించినా అది ఓ పట్టానా దొరకడం లేదు. దీని బాధ, ఆవేదన చూసి గ్రామస్తులు కూడా కలత చెందుతున్నారు. చిక్కకుండా మూతికి ప్లాస్టిక్ డబ్బాతో తిరుగుతున్న ఈ శునకం కష్టాన్ని పశువైద్యాధికారులు పట్టించుకుని డబ్బా బాధ నుంచి విముక్తి కల్పించాల్సి ఉంది.